క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సాత్‌ఎండ్‌పార్కు, ఆలిండియా రేడియో స్టేషన్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ మదర్‌డెయిరీ, లెక్చరర్స్‌కాలనీ, రాఘవేంద్రకాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు. కల్వంచ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మహేశ్వరం, హయత్‌నగర్ సూపర్‌వైజర్లు బుధవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేశ్వరం సీడీపీఓ శాంతి, హయత్‌నగర్ సీడీపీఓ రేణుక, సూపర్‌వైజర్లు ఇందిరా, భిక్షపమ్మ, శ్రీదేవి, శ్రీలత, జ్ఞానకుమారి పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్



మీర్‌పేట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు

మీర్‌పేట: బీజేపీ కార్యకర్తలు, కార్యాలయాలపై దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల దాడిని నిరసిస్తూ బీజేవైఎం నాయకులు బుధవారం మీర్‌పేట కూడలిలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన విధ్వంసకరంగా సాగుతోందని, బీజేపీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించొద్దని, ఇది పునరావృతం అయితే దాడులకు ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో కార్పొరేటర్ భిక్షపతిచారి, అక్కి వినయ్‌గౌడ్, ప్రదీప్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



కథనాన్ని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

కందుకూరు: సాక్షిలో వచ్చిన కథనానికి మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ స్పందించారు. పులిమామిడి–కోళ్లపడకల్ మధ్య ఉన్న రహదారి విషయమై 'అధ్వానంగా లింకు రోడ్డు' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనాన్ని స్థానిక నాయకులు కేఎల్‌ఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ రోడ్డుతో పాటు చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. దీనిపై ఆయన స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పులిమామిడి కాంగ్రెస్ నాయకులు బి.పాండురంగారెడ్డి, వత్తుల నారాయణ, జి.మల్లయ్య, పి.రవి, కె.బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ గాయత్రి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, పట్టుదలతో చదివి మంచి భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సత్యమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు

- అలంకరణలో బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం
- నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు



బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం

మహేశ్వరం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మామిడిపల్లిలోని ప్రాచీనమైన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆలయానికి పాలక మండలి లేకపోవడంతో దేవాదాయ శాఖ అధికారులకు తోడుగా ఏర్పాట్లు చేసేందుకు దాతలు ముందుకొచ్చారు. వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఆలయ పరిసరాలను రెండు రోజులుగా చదును చేస్తున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఉత్సవాలలో భాగంగా గురువారం అభిషేకం, వైకుంఠ ఏకాదశి ఉన్న శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార ప్రవేశాన్ని కల్పించనున్నారు. అనంతరం ఉదయం 4.30 గంటలకు స్వామి వారికి అభిషేకం, అర్చనలు కొనసాగనున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గరుడ వాహన సేవ ఊరేగింపు నిర్వహించనున్నారు. శనివారం కుడార్తై మహోత్సవం కొనసాగనుంది.

దేదీప్యమానంగా ఆలయం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయానికి విద్యుద్దీపాలను అలంకరించారు. ప్రధానమైన రెండో గోపురాలకు ఫ్లడ్ లైట్లతో పాటు ఆలయ ప్రాకారం, దశావతారాలకు కూడా విద్యుద్దీపాలు అమర్చడంతో ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతుంది. ఆలయ సమీపంలోని కార్గో రోడ్డు, పహాడీషరీఫ్ రహదారిలో వెళుతున్న వాహనదారులు ఈ వెలుగులు చూసి నేత్రానందం పొందుతున్నారు. ఆలయ పరిసరాలలోని రాళ్లకు వినాయక, పులి, పక్షుల బొమ్మల పెయింటింగ్‌లతో పాటు చెట్లకు కూడా జాజు, సున్నాలద్దుతున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా శ్రీరాం కాలనీలోని కోటి విద్య పాఠశాల విద్యార్థులు ఇక్కడ వాలంటీర్లుగా సేవలందించనున్నారు. బారికేడ్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

పార్టీలకతీతంగా

2020 లాక్‌డౌన్ నుంచి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో చక్కటి పార్కు ఏర్పాటు, స్వాగత కమాన్, కోనేరుపై కాలేయ మర్దిని విగ్రహం, గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహం, ఆలయ ప్రాకారంపై దశావతరాల నిర్మాణం, గర్భగుడిపై ప్రాకారం నిర్మించి ఆలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. ఈ అదనపు సొబగులతో ప్రస్తుతం ఆలయానికి కూడా భక్తుల తాకిడి



ఆలయ పరిసరాలను చదును చేయిస్తున్న దాత దామోదర్ సచిన్ సోని

పెరిగి.. దేవాదాయ శాఖకు ఆదాయం కూడా భారీగా సమకూరుతోంది. ఈసారి పాలక మండలి లేని కారణంగా గ్రామంలోని నాయకులందరు పార్టీలకతీతంగా పాల్గొని వైకుంఠ ఏకాదశిని విజయవంతం చేయాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

కందుకూరు: ఫ్యూచర్(ఫోర్త్) సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభు త్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి ఆయన రైతులతో మాట్లాడారు. భూ నిర్వాసితులకు పూర్తి న్యాయం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం కంటే అదనంగా ఇవ్వడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. వందేళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వంద మీటర్ల రహదారి నిర్మాణంతో పాటు సబ్ రోడ్లు, మెట్రో కనెక్టివిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. ప్రతి పక్షాలు ఫోర్త్ సిటీ అభివృద్ధికి సలహాలు, సూచనలు అందించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను తీసుకొని అధికారులు ముందుకు వెళ్తున్నారన్నారు. ఫోర్త్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఎడ్యుకేషన్, ఐటీ, స్పోర్ట్స్, హెల్త్ హబ్ వంటివి ఏర్పాటు చేయనున్నారన్నారు. స్కిల్స్ యూనివర్సిటీతో వృత్తి నైపుణ్యం పెరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవ్వనున్నాయన్నారు. అందరూ ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.కృష్ణనాయక్, రాణాప్రతాప్‌రెడ్డి,లచ్చానాయక్, శ్రీధర్, వెంకటేశ్‌గౌడ్, నర్సింహాచారి, జగన్, బాలమల్లేశ్‌యాదవ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ముడిమ్యాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావులపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో రావులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు కేసారం శ్రీనివాస్, బాల్‌రాజులతో పాటు వారి అనుచరులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, ప్రజాపాలనను చూసి గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, పార్టీలో చేరిన నాయకులు, యువకులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

షాబాద్: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేవెళ్ల పర్యటనలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి షాబాద్ మండల పరిధిలోని అంతారం నుంచి మన్‌మర్రి మీదుగా పరిగి రోడ్డుకు కలిసే విధంగా పనులు చేయాలని, ఈ రోడ్డును పీఆర్ నుంచి ఆర్‌అండ్‌బీలోకి మార్చి బీటీరోడ్డు వేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా



చేవెళ్ల: మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

స్పందించి త్వరలోనే బీటీరోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. వెంటనే పనులు ప్రారంభించాలని చెప్పారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బండ మహేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణకు నిధులివ్వండి

మొయినాబాద్: ఇటీవల పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి మార్చిన కవేలిగూడ–చందానగర్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. బుధవారం చేవెళ్ల మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్తున్న మంత్రికి మొయినాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవేలిగూడ–చందానగర్ రోడ్డు విస్తరణకు అధికారులు అంచనా వేశారని, వెంటనే నిధులు మంజూరు చేయించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి.. రోడ్డు పనులు మొదలుపెట్టే విధంగా చూస్తానని మంత్రి వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, ఎస్సీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కొత్తగా మరో రెండు జీపీలు!

- పంచాయతీలుగా అవతరించనున్న చంద్రాయన్‌గూడ, సంఘీగూడ
- మండలంలో 21కి చేరనున్న సంఖ్య
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామస్తులు

నందిగామ: నందిగామ మండలంలో మరో రెండు గ్రామాలు నూతన గ్రామ పంచాయతీలుగా అవతరించబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నూతన జీపీల ఏర్పాటులో భాగంగా జిల్లాలో 22 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు కాబోతుండగా నందిగామ మండలంలో నూతనంగా 2 గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన మండలాల ఏర్పాటులో భాగంగా కొత్తూరు మండలం నుంచి నందిగామను విడదీసి 10 గ్రామ పంచాయతీలతో నందిగామను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అనంతరం నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా నందిగామ మండలంలో ఉన్న 10 గ్రామ పంచాయతీలలో 8 అనుబంధ గ్రామాలను సైతం నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో మొత్తం 18 గ్రామ పంచాయతీలకు చేరాయి. చేగూరు గ్రామ పంచాయతీలోని అనుబంధ గ్రామాలు వెంకమ్మగూడ, బండోనిగూడ, బుగ్గోనిగూడ, తాళ్లగూడ, కన్హాలను విడదీసి ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఈదులపల్లికి అనుబంధ గ్రామంగా ఉన్న మోత్కులగూడను, వీర్లపల్లికి అనుబంధంగా ఉన్న అప్పారెడ్డిగూడలను, మామిడిపల్లికి అనుబంధంగా ఉన్న మొదళ్లగూడను, మంచన్‌పహాడ్‌ను కలిపి మొదళ్లగూడ గ్రామ పంచాయతీగా, దీంతో పాటు మరో అనుబంధ గ్రామం శ్రీనివాసులుగూడను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. రంగాపూర్‌కు అనుబంధ గ్రామంగా ఉన్న చాకలిగుట్టతండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు.



జీపీగా ఏర్పాటు కాబోతున్న సంఘీగూడ

కోర్టు ఆదేశాలతో అంతిరెడ్డిగూడ

నందిగామ గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న జంగోనిగూడ, అంతిరెడ్డిగూడ గ్రామాలను కలుపుకొని అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేసినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన కొంత మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో జంగోనిగూడను కలుపుకొని అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని, జంగోనిగూడతో కూడిన అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు రావడంతో అంతిరెడ్డిగూడ సైతం గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. దీంతో నందిగామ మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి.

తాజాగా చంద్రాయన్‌గూడ, సంఘీగూడ

మండల కేంద్రమైన నందిగామకు అనుబంధంగా ఉన్న చంద్రాయాన్‌గూడ, మేకగూడ గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న సంఘీగూడ గ్రామాలు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం నందిగామ గ్రామ పంచాయతీలో 14 వార్డులకు గాను 7,442 మంది జనాభా ఉన్నారు. ఇందులో చంద్రాయన్‌గూడలో 639 మంది ఉన్నారు. నందిగామ గ్రామ పంచాయతీ నుంచి చంద్రాయన్‌గూడను విడదీసి 639 మంది జనాభాతో చంద్రాయన్‌గూడను ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయనున్నారని విశ్వసనీయ సమాచారం. అదేవిధంగా మేకగూడలో 10 వార్డులకు గాను 2,703 మంది జనాభా ఉన్నారు. సంఘీగూడలో 582 మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం మేకగూడ నుంచి సంఘీగూడను విడదీసి 582 జనాభాతో సంఘీగూడను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయనున్నారు. దీంతో నందిగామ మండలంలో గ్రామ పంచాయితీల సంఖ్య 21కి చేరుకోనుంది. ఎన్నో ఏళ్లగా తమ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజల కోరిక నెరవేరబోతుండటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



చంద్రాయన్‌గూడ, సంఘీగూడ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపిన మాట వాస్తవమే. ఆ రెండు గ్రామ పంచాయితీలు ఏర్పాటు విషయమై తొందర్లోనే అధికారిక ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

–సుమతి, ఎంపీడీఓ

ఎస్సీ వర్గీకరణ సాధించుకుందాం

- వచ్చే నెల 7న జరిగే 'వెయ్యి గొంతులు–లక్ష డప్పులు' జయప్రదం చేద్దాం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహమాదిగ

మహేశ్వరం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 7న జరిగే 'వెయ్యి గొంతులు–లక్ష డప్పులు' ప్రదర్శనను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహమాదిగ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ చౌరస్తాలో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల నుంచి అలుపెరుగని పోరు చేసి మాదిగ జాతిని చైతన్యం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా కొంత మంది స్వార్థపరులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందుకే వర్గీకరణ సాధించేందుకు వెయ్యి గొంతులు–లక్షల డప్పుల చప్పుడును వినిపించేందుకు



డప్పుల ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, నాయకులు

మాదిగ, మాదిగ ఉప కులాలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ, నాయకులు మద్దిలేటి మాదిగ, ప్రశాంత్‌మాదిగ, గణేష్, రవిమాదిగ, కృష్ణ, అంబేద్కర్‌మాదిగ, అర్జున్, స్వామి, జంగన్న, జంగయ్య, ఉపేంద్ర, సుధాకర్, జనార్దన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసుల నిఘాతో సమానమని, నేరాలను అదుపు చేయడంలో అవి ఎంతో దోహదపడతాయని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు రూ.75వేలను అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటుగా ముఖ్య కూడళ్లలో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామపెద్దల ఏకగ్రీవ తీర్మానంతో గ్రామంలో శాశ్వత మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తుండటం అభినందనీయమన్నారు. మద్యపాన నిషేధాన్ని ఎవరూ ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ బలరాంను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అనంతం, రఘురామ్, శ్రీనివాస్, రాజు, శ్రీధర్‌రెడ్డి, సామెల్, జంగయ్య, బాల్‌రాజ్, గణేశ్, యాదయ్య, పెంటయ్య, గిరి, శ్రీధర్, బాబా పాల్గొన్నారు.

పంచాయతీ నర్సరీల్లో మొక్కల పెంపునకు చర్యలు

శంషాబాద్ రూరల్: పచ్చదనం పెంపునకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవానికి మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీల ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో నర్సరీల్లో మొక్కల పెంపు చేపట్టారు. మండలంలోని 21 పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు సంచుల్లో మట్టి నింపి విత్తనాలు వేస్తున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాల ఆవరణలు, రోడ్లకు ఇరువైపులా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ మొక్కలను నాటనున్నారు.

పంచాయతీకి పది వేల మొక్కలు..

ప్రతి పంచాయతీకి పది వేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు చర్యలు చేపట్టారు. 21 పంచాయతీలకు మొత్తం 2,10,000 మొక్కలను పెంచాల్సి ఉంది. ఇది వరకు నాటిన వాటిలో 93 వేల మొక్కలు మిగిలాయి.వాటిని మినహాయించి మిగిలిన మొక్కలను పెంచేందుకు నర్సరీల్లో ఏర్పాట్లు చేశారు.

రకరకాల మొక్కలు..

నర్సరీల్లో రకరకాల మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల విత్తనాలు నాటే పనులు ప్రారంభించారు. నర్సరీల్లో కానుగ, నేరేడు, ఈత, తాటి, గుల్మోరా, రాగి, మర్రి, చింత, సీతాఫలం, తులసి, బొప్పాయి. కలమంద, తదితర మొక్కలను పెంచుతున్నారు. వీటితో పాటు ఇళ్ల వద్ద పెంచుకునేందుకు మందార, గులాబీ, గన్నేరు, మునగ, కరివేపాకు, జామ, దానిమ్మ వంటి రకాలను పెంచేందుకు చర్యలు చేపట్టారు.



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

సంరక్షణపైనే సందేహాలు

ఏటా పంచాయతీల ఆధ్వర్యంలో వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. రైతుల పొలాలు, గ్రామాల్లోని ఇళ్ల వద్ద నాటిన మొక్కలతో పాటు ప్రభుత్వ స్థలాలు, రోడ్ల వెంబడి నాటిన మొక్కల్లో సింహభాగం కనిపించడంలేదు. ప్రతి ఏడాది వర్షాకాలంలో భారీ సంఖ్యలో మొక్కలు నాటుతున్నా ఈ మేరకు వాటి సంరక్షణ లేకపోవడంతో లక్ష్యం నెరవేరడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. రైతులతో పాటు గ్రామస్తులకు పచ్చదనంపై మరింత అవగాహన కల్పించి మొక్కలను సంరక్షించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. గత ఏడాది ఆయా పంచాయతీల్లో పెంచిన మొక్కల్లో ఇంకా 93 వేల మొక్కలను నాటలేదు. వీటిని ఆయా నర్సరీల నుంచి అవసరం ఉన్న చోటకు తరలించి వచ్చే వానాకాలంలో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



కవ్వగూడ పంచాయతీ నర్సరీలో బ్యాగుల్లో విత్తనాలు నింపుతున్న కూలీలు